# గిరిజన బిడ్డకు అరుదైన గౌరవం

- ఆకుతోటబావి తండాకు చెందిన సోంలాల్‌నాయక్‌కు పద్మశ్రీ
- భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించినందుకు గుర్తింపు



పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోంలాల్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 26 : మారుమూల తండాకు చెందిన గిరిజన బిడ్డకు అరుదైన గౌరవం లభించింది. చిన్న నాటి నుంచి ఆధ్యాత్మికత, భగవద్గీతపై ఉన్న మక్కువకు అత్యున్నత పురస్కారం దక్కింది. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పలు రంగాల్లో సేవలందించిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డులు ప్రకటించింది. ఇందులో భాగంగా భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారా భాషలోకి అనువదించిన కేతావత్ సోంలాల్‌నాయక్‌ను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది.

సోంలాల్‌నాయక్ ఆకుతోటబావి తండాకు చెందిన నిరుపేద కుటుంబంలో కేతావత్ తారా – భిక్ష్యానాయక్ దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచి తండా ప్రజల జీవన స్థితిగతులను దగ్గరుండి గమనించారు. ఆయనకు చిన్ననాటి నుంచి దైవారాధన, ఆధ్యాత్మికతపై ఎంతో శ్రద్ధ ఉండేది. ఈ క్రమంలో చిన్నతనంలోనే భగవద్గీత పారాయణం, శ్రవణంతో గీతా సారాంశాన్ని అందిపుచ్చుకున్నారు. బొల్లేపల్లి పాఠశాలలో ప్రాథమిక విద్య చదివిన ఆయన.. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. సోంలాల్ గిరిజనులకు అనువైన బంజారా భాషకు లిపిని రూపొందించడంతోపాటు హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారా భాషలోకి అనువదించారు. ఇందుకుగాను ఆయనను పద్మశ్రీ వరించింది. కేంద్ర అత్యున్నత పురస్కారం రావడం ఎంతో సంతోషకరమని అవార్డు గ్రహీతతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం పాటుపడే గొప్ప వ్యక్తి సోంలాల్‌కు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషదాయకమని గిరిజన పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవసోత్ త్రివిక్రం రాథోడ్ అన్నారు.

# శిల్పాల రూపకర్తకు కేంద్ర పురస్కారం

- డాక్టర్ ఆనందాచార్యుల వేలుకు పద్మశ్రీ
- యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణంలో ఆయన సేవలు



యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా శిలలను పరిశీలిస్తున్న స్థపతి వేలు (ఫైల్)



స్థపతి డాక్టర్ వేలు

యాదగిరిగుట్ట, జనవరి 26 : వైటీడీఏ స్థపతి సలహాదారు డాక్టర్ ఆనందాచార్యుల వేలు పేరు యాదగిరిగుట్ట ఆలయ చరిత్రలో నిలిచిపోనున్నది. ఆధ్యాత్మికత ఉట్టిపడే కృష్ణశిలల కమనీయ శిల్పాలు, భక్తి పారవశ్యంతో మైమరిపించే దేవతామూర్తులు, ఆహ్లాదం ఉట్టిపడే ప్రకృతి రమణీయత, భక్తజన కోటికి సౌకర్యాల కల్పనలో ఆయన శ్రమ ఎంతో ఉన్నది. 70 పదుల వయస్సులో ఇప్పటికీ శిల్ప కళపై మక్కువ చూపుతూ అనేక చిత్రాలను వేస్తూ చరిత్ర సృష్టిస్తున్నారు. వైటీడీఏ స్థపతి సలహాదారుడిగా ఉన్న డాక్టర్ వేలుకు దేశ అత్యుత్తమ పురస్కారం పద్మశ్రీ వరించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా వెన్నంపల్లిలో 1952 జూన్ 1న ఆనందాచార్యుల వేలు జన్మించారు. ఎస్ఎస్ఎల్‌సీ విద్య అనంతరం 1972లో తిరుపతి టీటీడీ శిల్ప కళాశాలలో నాలుగేండ్లు శిల్పకళను అభ్యసించారు. 1975లో దేవాదాయ శిల్ప కళాశాలలో అడుగుపెట్టి 1978 వరకు పనిచేశారు. 1980లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ శ్రీశైలం ప్రాజెక్టులో పనిచేశారు. 1980లో దేవాదాయ శాఖలో సహాయ స్థపతిగా ఆలయ ప్లాన్లు, ఆలయ నిర్మాణాలు, పునర్నిర్మాణ పర్యవేక్షణ చేసేందుకు ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రధాన ఆలయాల్లో విధులు నిర్వర్తించారు. 1990లో ఉప స్థపతిగా పదోన్నతి పొంది ద్వారక తిరుమలలో పనిచేశారు. బుగ్గమఠం, హథారంజీ మఠం, తిరుపతి, హైదరాబాద్ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టులో పనిచేశారు. 2009–10లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రధాన స్థపతిగా అనేక ఆలయ నిర్మాణాల పర్యవేక్షణలో పాల్గొన్నారు. 2010లో పదవీ విరమణ పొంది సాంకేతిక సలహా సభ్యుడిగా, స్థపతి సలహాదారుడిగా వైటీడీఏ ప్రధాన స్థపతి ఎన్.సుందరరాజన్‌తో కలిసి మయమత, కాశ్యప శిల్ప గ్రంథం తెలుగులో ప్రచురించేందుకు 2013 వరకు కలిసి పనిచేశారు. 2014లో ఆస్థాన స్థపతిగా శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వర్తించారు. ఉద్యోగం చేస్తూనే విరామ సమయంలో దూర విద్య ద్వారా ఓయూలో ఎంఏ ఆర్కియాలజీ పూర్తి చేశారు.

**యాదగిరిగుట్ట చరిత్రలో డాక్టర్ వేలు..**

2015లో మాజీ సీఎం కేసీఆర్ పునర్నిర్మించిన యాదగిరిగుట్ట దేవస్థానం నిర్మాణంలో ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి, స్థపతి సుందరరాజన్‌తో కలిసి డాక్టర్ వేలు పనిచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో కృష్ణశిల నిర్ధారణ కమిటీలో సభ్యులుగా స్థపతి సలహాదారు డాక్టర్ వేలు తన మేధాశక్తిని ఉపయోగించారు. శిల్పి హరిప్రసాద్, వైటీడీఏ కన్సల్టెంట్ ఇంజినీర్ రాఘవేంద్రరావుతో కలిసి రాష్ట్రమంతటా పర్యటించి నాణ్యమైన కృష్ణశిలను గుర్తించారు. సుమారు వెయ్యి ఆలయ ప్లాన్లు పరిశీలించి వైటీడీఏ వారికి సమర్పించి ఆలయ నిర్మాణాల పర్యవేక్షణ చేశారు. గర్భాలయంలో ఉపాలయాలు, ప్రహ్లాదుడి చరిత్ర, నిలువెత్తు ఆళ్వారులు, పంచనారసింహ స్వామి అవతారాలు, అష్టభుజి ప్రాకారాలు, ఐదంతస్తుల రాజ గోపురాలు, 7 అంతస్తుల రాజ గోపురం, యాళీ పిల్లర్లు, దశావతారాలు, అమ్మవారి విగ్రహాలతోపాటు తెలంగాణ సంస్కృతి, వివిధ రకాల నాణేలు, తెలంగాణ పండుగ, సంప్రదాయాలను గుర్తిస్తూ చక్కటి ఆకారాలను డాక్టర్ వేలు చెక్కారు.

**పద్మశ్రీ అవార్డు వరించడంలో ప్రధాన అంశాలివే..**

- తిరుపతి వేంకటేశ్వర శిల్ప కళాశాలలో విద్యనభ్యసించి దేవాదాయ శాఖలో ప్రధాన స్థపతిగా సుస్థిర స్థానాన్ని సంపాదించడం.
- తిరుపతి వేంకటేశ్వర శిల్ప కళాశాల విద్యార్థుల్లో మొదటిసారిగా, మొదటి విద్యార్థిగా డాక్టర్ వేలు శిల్ప కళారత్న అవార్డు స్వీకరించడం.
- తిరుపతి వేంకటేశ్వర శిల్ప కళాశాలలో చదువుకున్న విద్యార్థుల్లో తొలిసారిగా డాక్టర్ వేలు బంగారు పతకంతోపాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, పలు వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించడం.
- దేవాదాయ శాఖలో 30 సంవత్సరాలు స్థపతిగా విధులు నిర్వర్తించడం.
- యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణాన్ని మహాద్భుతంగా తీర్చదిద్దడం

**150కు పైగా అవార్డులు**

1987లో అఖిల భారత చిత్రకళా పోటీల్లో బంగారు పథకం సాధించారు. 2002, 2008 శిల్ప విభాగానికి ఉగాది పురస్కారం అందుకున్నారు. 2013లో కళారత్న అవార్డుతో పాటు నగదు పురస్కారం అందుకున్నారు. వేలు లింకా బుక్, గ్లోబల్ ఇండియా, ఆర్‌హెచ్ఆర్ యూనిక్ తెలుగు బుక్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డు, ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డు వంటి ప్రపంచ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. లలితాకళా అకాడమీ, హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అవార్డులు స్వీకరించారు. వేలును 150కి పైగా అవార్డులు వరించాయి. డాక్టర్ వేలు చిత్రించిన ఫైర్ అనే వర్ణచిత్రం ఇంటర్నేషనల్ డిజైన్ పోటీల్లో ఒసాక జపాన్‌లో ప్రదర్శించబడ్డాయి. టీవీ, రేడియోల్లో శిల్ప శాస్త్ర ప్రసంగాలు చేశారు. వేలుకు శిల్పకళా విభూషణ్, ఔషధ కళాశిల్పి బిరుదులు వరించాయి. ది బెస్ట్ సీనియర్ సిటిజన్, రవీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు, అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు, వివేకానంద అవార్డు లభించాయి. వీరి ప్రతిభను గుర్తించి తెలుగు యూనివర్సిటీ ప్రతిభా పురస్కారం అందజేసింది.



రామగిరి : జడ్పీలో జెండా ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, చిత్రంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి



దేవరకొండ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలూనాయక్, ఎంపీడీఓ రామకృష్ణశర్మ, సిబ్బంది



రామగిరి : బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, చిరుమర్తి

# వాడవాడలా గణతంత్రం

75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. కలెక్టరేట్‌లో, పోలీస్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను కలెక్టర్ దాసరి హరిచందన ఆవిష్కరించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చందనా దీప్తి, డీపీఓ కార్యాలయంలో డీఈఓ సుచరిత, డీఈఓ కార్యాలయంలో డీఈఓ భిక్షపతి, ఎంజీయూలో వీసీ గోపాల్‌రెడ్డి, జడ్పీలో సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, మున్సిపాలిటీలో కమిషనర్ రవి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పార్టీ కార్యాలయాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల్లో మువ్వన్నెల జెండాలను ఎగురవేసి గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




ఎంజీయూలో జెండా ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి



నకిరేకల్ : మున్సిపల్ కార్యాలయ భవనంపై జెండావిష్కరణ అనంతరం జాతీయ గీతాలాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్



మిర్యాలగూడ : ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఆర్డీఓ చెన్నయ్య, ఇతర అధికారులు



మిర్యాలగూడ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడ : బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, పక్కన ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



నందికొండ : బుద్ధవనంలో జెండా ఎగురవేస్తున్న బుద్ధవనం ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి, ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య



నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బ్రాంచ్ మేనేజర్ తొవిటి మహేందర్, ఎడిషన్ ఇన్‌చార్జి మడూరి నరేందర్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, సిబ్బంది



చిట్యాల : పోలీస్‌స్టేషన్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రవి



పెద్దఅడిశర్లపల్లి : తాసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్



డిండి : జాతీయ జెండాకు వందనం చేస్తున్న తాసీల్దార్ తిరుపతయ్య, ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు, వైస్ ఎంపీపీ పుల్లమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ దానేల్



కట్టంగూర్ : తాసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న తాసీల్దార్ స్వప్న, అధికారులు, ప్రజాప్రతినిధులు



కేతేపల్లి : తాసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీపీ శేఖర్, జడ్పీటీసీ స్వర్ణలత



మిర్యాలగూడ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి



చందంపేట తాసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తాసీల్దార్ రాములు

### చిత్రలేఖనంలో చైత్రారెడ్డికి మొదటి బహుమతి

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మౌంట్ లిటెరా జీ స్కూల్‌కు చెందిన జిన్న చైత్రారెడ్డి మొదటి బహుమతి సాధించింది. 'టాపిక్ ఆన్ డ్రగ్స్ అడిక్షన్' అంశంపై నిర్వహించిన పోటీల్లో చైత్రారెడ్డి ఈ బహుమతి పొందింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో చైత్రారెడ్డికి కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి ప్రశంసా పత్రం అందజేశారు.






ఆటలపోటీల్లో గెలుపొందిన లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఆర్కిటెక్ ఇంజినీర్ జునేద్ హష్మి

# కేంద్రం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి



మిర్యాలగూడ : ర్యాలీలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 26 : కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉప్యాక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. రైతు చట్టాలపై కేంద్రం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని గతంలో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారని, ఆ సమయంలో చట్టాలను ఉపసంహరించుకుంటూ కేంద్రం ప్రకటించి రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, రవినాయక్, మంగారెడ్డి, గోవర్ధని, శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరెడ్డి, సైదులు, రాజు, నాయుడు పాల్గొన్నారు.

నకిరేకల్ : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై పోరాడాలని రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కందాల ప్రమీల పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్ పట్టణంలో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరుగబోయే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్, సీఐటీయూ జిల్లా సభ్యుడు వెంకటేశ్వర్లు, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి మారయ్య, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల : ప్రజాస్వామ్య వాదులంతా కేంద్ర ప్రభుత్వవిధానాలను వ్యతిరేకించాలని చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేశ్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం చిట్యాలలో నిర్వహించిన మోటర్ సైకిల్ ర్యాలీలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను, శీల రాజయ్య, మెట్టు నర్సింహ, చింతపల్లి బయ్యన్న, చెర్కు పెద్దులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే బాలూనాయక్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కొండమల్లేపల్లి, జనవరి 26 : నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. శుక్రవారం మండంలోని వడ్త్యాతండాలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాల్, గాజీనగర్‌లో రూ.20 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం, రూ.8.30 లక్షలతో మనఊరు–మన బడి కింద మౌలిక సదుపాయాల కల్పన, కొండమల్లేపల్లిలో రూ.15లక్షలతో ఈద్‌గాహ్ ప్రహరీ నిర్మాణం, కొర్రతండాలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం, చింతకుంట్లలో రూ.20 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం, చెన్నారంలో రూ.20 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం, గుర్రపుతండాలో రూ.5 లక్షలతో బస్ షెల్టర్ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ లక్కీదాస్, రమావత్ జగన్‌నాయక్, రాణి, సర్పంచ్‌లు బలరాం, రమేశ్, లచ్చిరాంనాయక్, రుద్రమ్మ, అనిత, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

శాలిగౌరారం, జనవరి 26 : మండలంలోని ఇటుకులపహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు అల్లి దుర్గయ్య, మాతంగి వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గ్రామానికి వెళ్లి ఇరువురి కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి హతీశ్‌రెడ్డి, సర్వయ్య, శేఖర్, శంకర్, సైదులు, శ్రీనివాస్ ఉన్నారు.